# గొరవయ్యలు

గొరవయ్యలను గొడుగు మల్లయ్యలని, మల్లన్నలని, మల్లయ్యతాతలని, గొగ్గయ్యలని ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఒగ్గప్పలని కర్నాటకలోనూ పిలుస్తారు. గొరవయ్యలనగా పెద్దవారని, గురువులని అర్థం. వీరు కురమ కులంలో పూజారులుగా వ్యవహరిస్తూ శైవమత వ్యాప్తికి తిరుగుచూ ప్రచారం చేస్తారు. వీరు అనంతపురం, కర్నూలు జిల్లాలలో ఎక్కువగా నివసిస్తున్నారు. కర్నాటకరాష్ట్రంలో బళ్ళారి, అనెగొండ, హొస్పేట, గంగావతిలోను ఎక్కువగా ఉన్నారు. వీరు దసరా పండుగ రోజులలో కర్నూలు జిల్లాలోని గట్టు మల్లయ్య కొండగ్రామంలో వెంచేసివున్న శ్రీ మల్లన్న స్వామిని పూజించి రక్తమును స్వామికి భక్తిపూర్వకంగా అర్పిస్తారు. గొరవయ్యల ఆవిర్భావం గురించి రెండు కథలు చెప్పబడుచున్నవి. మొదటిది పూర్వం మని, మల్లాసుర అనురాక్షసులు శివుని గురించి తపస్సుచేసి ఆయన వద్దనుండి ఎన్నో వరాలతోపాటు ఆయుధంతో తమను ఎవరూ చంపలేరని వరం పొందియుండిరి. వరాలు పొందుటవల్ల వారికి అహంభావం పెరిగి భక్తులను హింసించేవారు. వారి ఆకృత్యాలు గమనించి పరమశివుడు భైరవరూపంలో వచ్చి ఆ రాక్షసులనిద్దరిని సంహరిస్తాడు. ఆ రాక్షసులిద్దరూ తమను సంహరించినది పరమశివునిగా గుర్తించి శివుని మూడు రక్తపుబొట్లు ఆయన ఎడమతొడనుండి ఇవ్వవలసిందిగా కోరారు. అంతట పరమశివుడు ప్రతి దసరా పండుగరోజున తాను గొరవయ్య రూపంలో వచ్చి తన ఎడమతొడనుండి మూడు రక్తపుబొట్లు ఇస్తానని తెలిపాడు. ఈ పురాణగాథను ఇప్పటికీ ప్రతి దసరారోజున ప్రదర్శిస్తారు.



రెండవకథ ఏమనగా మల్లన్నదేవుడు, ఆయన భార్య మాలవ్వ దేవత ఒకసారి వారియొక్క గణాలు అనగా వారి కుక్కల సామర్థ్యం పరీక్షించుటకై ఇరువర్గాలవారికి ఒక ఇనుపగొలుసు తెంచమని పోటీ పెట్టగా ఆ పందెంలో మాలవ్వ యొక్క గణాలు

గొలుసును త్రెంచి పందెం గెలిచాయి. అంతట మల్లన్నదేవుడు ఆ సందర్భానికి గుర్తింపుగా తనగణాల వారిని ఉత్సవం చేయమని ఆదేశించెను. ఒక పళ్లెం నిండా పాలుపోసిపెట్టి రెండు గణములు (కుక్కలు) త్రాగమనగా ఆ రెండు గణాలు (కుక్కలు) ఆ పళ్లెం చుట్టూతిరుగుచూ ఒకరిపై ఒకరు అరచుకొనుచూ కరచుకొనుచూ పాలు త్రాగెను. దీనినే ఒగ్గు సేవ అందురు. ఇప్పటికి శివరాత్రి పర్వదినాన గొరవయ్యలు భక్తులు తీసికొని వచ్చిన పాలను ఒక పళ్లెంలో పోసి ఆ పళ్లెం చుట్టూ నృత్యం చేస్తూ తిరుగుచూ ఒకరికి ఒకరు కుక్కలవలె అరుస్తూ కరచుకుంటూ పాలు త్రాగెదరు. వారు త్రాగగా మిగిలినపాలను, మిగిలిన పళ్లను ప్రసాదంగా భక్తులు భక్తితో స్వీకరిస్తారు. తరువాత ఇనుప గొలుసును త్రెంచుదురు.

గొరవయ్యల నాయకుడు త్రిశూలంతో తన ఎడమతొడను పొడుచుకొని వచ్చిన రక్తాన్ని భగవంతునికి అర్పించును. ఈ విధంగా గొరవయ్యలు వారి ఆవిర్భావానికి సంబంధించిన కథలను భక్తి ప్రపత్తులతో ప్రదర్శించెదరు.

వీరి ఆహార్యం : మెడనుండి పాదాలవరకు నల్ల గొర్రె ఊలుతో చేయబడిన అంగారక, ఎలుగుబంటి చర్మంతో చేయబడిన టోపి, మెడచుట్టూ రంగుల లేసు, నడుంచుట్టూ గంటలు, కాళ్లకు గజ్జెలు ఉంటాయి. ఒకచేతిలో త్రిశూలం, ఇంకొక చేతిలో పిల్లనగ్రోవి ఉంటాయి. అనగా శివ కేశవులకు బేధం లేదని తెలుపుట ఈ వేషధారణయొక్క ముఖ్య ఉద్ధేశ్యము. పిల్లనగ్రోవిని ఊదుతూ, ఢమరకాన్ని వాయిస్తూ లయబద్ధంగా చిందులతో నృత్యం చేస్తూవుంటారు.

కురమకులంలో "గొరవయ్య దీక్ష" తీసికొనిన వారిని గొరవయ్యలుగా అంగీకరించి గౌరవించెదరు. తల్లి తండ్రులు వారు మొక్కుకున్నవిధంగా వారి పిల్లలలో ఒకరిని ఎక్కువగా పెద్దపిల్లవానిని భగవంతుని సేవకై అర్పించెదరు. అట్టి పిల్లలకు చిన్నవయస్సులోనే గొరవయ్య పెద్దతో దీక్ష ఇప్పించెదరు. పెద్దగొరవయ్య పిల్లవానికి మంత్రం ఉపదేశంచేసి బండారు అతని భుజములకు పెట్టి అతను ఆ రోజునుండి వేసుకొనవలసిన గొరవయ్య దుస్తులను ఇచ్చును. ఆ రోజు నుండి ఆ బాలుడు అందరిచేత గొరవయ్యగా గౌరవించబడును. అతని తల్లి తండ్రులు కూడా ఆ బాలుని భగవంతుని సేవకునిగా గుర్తించి గౌరవిస్తారు. పండుగ రోజులలో గొరవయ్యలు భగవంతుని కీర్తించుచూ వారికి "బండారు" ఇచ్చి ఆశీర్వదిస్తారు. వారు నాలికలో శూలము గుచ్చుకొనుట, బుగ్గలలో శూలం గుచ్చుకొనుట మొదలయిన భయంకర విన్యాసములు చేయుదురు.

గొరవయ్యలుగా కురమ కులస్థులే కాక అన్ని కులాలవారు ముఖ్యంగా సంఘంలో అట్టడుగు వర్గంవారు కూడా గొరవయ్య దీక్షతీసికొని భగవంతుని సేవకులుగా గౌరవించబడుచున్నారు. సర్వమానవ సమానత్వము ఈ గొరవయ్యల ముఖ్యోద్దేశ్యం